క్లుప్తంగా

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌పై శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

బసిరెడ్డికి జేటీసీగా పోస్టింగ్


బసిరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు డీటీసీ బసిరెడ్డికి తిరుపతి జేటీసీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. గతేడాది ఆయనకు జేటీసీగా ఉద్యోగోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి తిరుపతి జేటీసీగా నియమిస్తూ ఉత్వర్వులు ఇచ్చింది. కాగా ఆయన త్వరలోనే జేటీసీగా బాధ్యతలను చేపడతారని, చిత్తూరు టీడీసీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తిరుమల : తిరుమలకు మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని తిరుమల ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ సీఐ తిరుమలయ్య తెలిపిన వివరాల మేరకు.. అలిపిరిలోని టీటీడీ సప్తగిరి చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఈబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రకాశం జిల్లా ఎర్రంగొండపాలెం మండలం వై.కొత్తపల్లికి చెందిన కె.ఈశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీచేశారు. ఆ బ్యాగులో ఐదు మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

గర్భిణులకు భోజన సదుపాయం


గర్భిణులకు భోజనాన్ని వడ్డిస్తున్న వైద్యులు దివాకర్, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పేద గర్భిణులకు వైద్యాధికారులు మాధవి, వైద్యులు దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులు ఇబ్బంది పడకూడదని మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనరు, మాజీ సర్పంచ్ గురవయ్య వీరికి భోజన సదుపాయం కల్పించారు. 70 మంది పేద గర్భిణులతోపాటు వచ్చిన సహాయకులకు భోజనాన్ని అందించిన దాత గురవయ్యను వైద్య సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, పద్మకుమారి, వైద్య సిబ్బంది పద్మశ్రీ, మీనాక్షి, రత్నమ్మ పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

- ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ
- పీఓ, ఏపీఓలకు జేసీ వెంకటేశ్వర్ సూచనలు


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓలు విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జేసీ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న వారికి రెండోసారి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మార్చి 13న ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటలలోపు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఇవ్వడం జరుగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయా డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. 12వ తేదీన డివిజన్ కేంద్రాలకు పీఓలు, ఏపీఓలు, ఓపీఓ చేరుకుని మెటీరియల్‌లో చెక్ లిస్టు ప్రకారం (బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్ సీల్, రెండు రకాల బ్యాలెట్ పేపర్లు, ఎలక్ట్రోరల్ రోల్స్ మొదలగునవి) ఉన్నాయా ? లేవా అని సరిచూసుకోవాలన్నారు.

కేంద్రాలకు బృందంగా వెళ్లాలి..

పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్ అంతా ఒక బృందంగా ఉండి వారికి కేటాయించిన పోలింగ్‌స్టేషన్‌కు ఈ నెల 12వ తేదీ సాయంత్రంలోపు చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బీఎల్ఓలు, వీఆర్ఓలను అనుసంధానం చేశామని, వీరితో సమన్వయం చేసుకోవాలన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్‌లోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని చెప్పారు.

ఏజెంట్లకు పకడ్బందీగా పాస్‌ల పంపిణీ..

ఈనెల 13న ఉదయం 7 గంటల్లోపు ఏజెంట్లకు పాస్‌లు, సీటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. ఉదయం 8 గంటలకు కచ్చితంగా పోలింగ్ ప్రారంభమయ్యేలా ప్రిసైడింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలైన ఓట్లు శాతాన్ని ప్రతిగంటకు ఒకసారి నివేదిక అందజేయాలన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీల్ చేసి సంతకాలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ డివిజన్ రిసెప్షన్ సెంటర్ స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లను చేర్చాలన్నారు. పీఓ డైరీ ఇతర ప్రొఫార్మాలను అందజేయాలన్నారు. డీఆర్ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ఆర్డీఓలు రేణుక, సృజన, శివయ్య, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం రాష్ట్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆరు జిల్లాల డీఆర్‌ఓలు, ఆర్డీఓలతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, ఈనెల 11న మరోసారి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్‌ను జిల్లాలోని 4 రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పంకు పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. బ్యాలెట్ బాక్సుల ప్రిపరేషన్‌లో 287 బ్యాలెట్ బాక్సులను డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అందుబాటులో పెట్టినట్లు తెలిపారు. 100 పోలింగ్ కేంద్రాల్లో (69 పట్టభద్రులు పోలింగ్ కేంద్రాలు, 31 ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాలు) వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 16న చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు మూడు షిఫ్టులలో విధులు నిర్వర్తించేందుకు 195 మంది సూపర్‌వైజర్లు, 585 అసిస్టెంట్లు మొత్తం 780 మందిని గుర్తించామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్ఓ ఎన్.రాజశేఖర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాముఖ్యత


రిటైర్డు అంగన్‌వాడీ కార్యకర్తలకు సన్మానం

సత్యవేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాముఖ్యత ఇస్తోందని డీసీసీ బ్యాంకు మేనేజర్ తేజస్వి అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం, సీడీపీఓ కార్యాలయాల్లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. రిటైర్డు అంగన్‌వాడీ కార్యకర్తలు 20 మందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం స్వర్ణలత, స్టేట్ బ్యాంకు మేనేజర్ జోసఫ్ కెనడీ, సూపర్ వైజర్లు శ్రీదేవి, సంధ్య, జ్యోతి, యమున, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య బోధన అవసరం

సత్యవేడు: పాఠశాలలో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన బోధన అందించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్ తెలిపారు. ఆయన గురువారం ఎంఈఓ రవితో కలసి మండలంలోని అమాసరెడ్డి కండ్రిగ పాఠశాలను పరిశీలించారు. 90రోజులుగా అమలు చేస్తున్న 'టీచింగ్ అట్‌ద రైట్ లెవల్' కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థులు తప్పులు లేకుండా చదవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం వండి వడ్డించాలని సూచించారు. అంతకు ముందు భవిత సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఎంఈఓ కార్యాలయంలో టీచింగ్ స్టూల్ కార్యక్రమంపై మండల స్థాయిలో సీఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీలు చెంగమ్మ, రామారావు, బాలకృష్ణ, కుమార్, మునస్వామి, మోహన్ పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

20.02.2023వ తేదీన నా క్లయింట్ అయిన కడపల సుమంత్ శ్రేయస్ తండ్రి కడపల శ్రీనివాస్ రెడ్డి తండ్రి శ్రీకాంత్ రెడ్డి గారు అయ్యలూరు మెట్ట వద్ద గల పంజాబీ దాబా నుండి నంద్యాలకు వెళ్ళు మార్గమధ్యమంలో తన స్వాధీనములో ఉన్న సంబంధించిన ప్లాట్ నెం. 17, సర్వే నెం. 388/1&2 and 388/18 గాలుపు ఏర్పడిన దస్తావేజు నెం. 5970/1996నకు లింకు డాక్యుమెంట్ అయిన డాక్యుమెంట్ నెం. 1355/1989 గల ఒరిజినల్ డాక్యుమెంట్ పోగొట్టుకున్నారు. కావున సదరు ఒరిజినల్ డాక్యుమెంటు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింద తెలుపబడిన నెంబరుకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

పి.రమేష్ కుమార్, అడ్వకేట్, ఇ.నెం. 25/537, శ్రీనివాసనగర్, నంద్యాల. సెల్: 98491 48535

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన రాజేష్(38), సుబ్రమణ్యం(31) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

వరదయ్యపాళెం: మండలంలోని వీకేఆర్‌వై కాలనీ ప్రాథమిక పాఠశాలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్ గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 3,4,5 తరగతులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న టీచింగ్ ఎట్ రైట్ లెవల్ (టార్లు) కార్యక్రమం గురించి ట్యాబ్‌లో వివరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని ఆరా తీశారు.

రికవరీ లక్ష్యాలను పూర్తి చేయాలి

గూడూరు: రుణ రికవరీ లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శంకర్ బాబు ఆదేశించారు. పట్టణంలోని రాజావీధిలోని ఓ ప్రైవేటు హాల్లో సహకార బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్లతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూరుణాల లక్ష్యాలను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. శ్రీధర్‌రెడ్డి, రామా నాయుడు, నారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.











క్లుప్తంగా

మహిళా టీచర్లకు సత్కారం



టీచర్లను సత్కరిస్తున్న హెచ్ఎం గోపి

పాకాల: మొగరాల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా టీచర్లను ఘనంగా సత్కరించారు. గురువారం పాఠశాల హెచ్ఎం గోపి ఆధ్వర్యంలో టీచర్లు రేవతి, హసీనా బేగం, ప్రబోధిని, శైలజలను సత్కరించారు. ఉపాధ్యాయులు గోవిందరాజానాయుడు, బాలాజీ, బాలరాజు, రామయ్య, జయచంద్ర, రామూర్తి, శివశంకర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమానికి చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

తిరుపతి తుడా: తిరుపతి పాస్ మనో వికాస్ కేంద్రానికి శెట్టిపల్లికి చెందిన కాళహస్తి ధనంజయ అతని మిత్రుల బృందం అనాథలు, అభాగ్యులకు తమ వంతు సాయం అందించారు. పాస్ వికాస కేంద్రంలోని వందమంది అభాగ్యులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. ధనంజయ కుటుంబసభ్యులు , శెట్టిపల్లి గ్రామం వార్డ్ మెంబర్ రామ్మూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ



సాయం అందజేస్తున్న సర్పంచ్ ఫాజిలా

చంద్రగిరి: మండల పరిధిలోని ఐతేపల్లె పంచాయతీ ఏజీపల్లె హరిజనవాడకు చెందిన ధనుంజయ(45) కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయం కింద గురువారం సర్పంచ్ ఫాజిలా రూ.10వేలను అందజేశారు. రెండు రోజుల కిందట ధనుంజయ అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచ్ మాట్లాడుతూ ధనుంజయ భార్య లక్ష్మీప్రియకు తక్షణ సాయం అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లం రాజశేఖర్, అంజద్ ఖాన్, బాలాజీ, రవళి, శ్రావణి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశు పాల్గొన్నారు.

మీడియా కేంద్రం ఏర్పాటు హర్షణీయం

రామచంద్రాపురం: మండల కేంద్రంలో మీడియా కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషకరమని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామిజీ అన్నారు. గురువారం మీడియా ఆయన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఢిల్లీ, భానుకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ గిరిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటు వేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నాయకులు

రామచంద్రాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మీడియా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాయకులు బీకిరెడ్డి, మునీంద్ర యాదవ్, రాజేష్, పుష్పకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల లడ్డూ కాంప్లెక్స్‌లోని కౌంటర్‌లో సొమ్మును అపహరించిన కేసులో తిరుపతి రూరల్ తిరుచానూరు దామినేడుకు చెందిన పులి సీతాపతికి మూడు నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది జనవరి 24వ తేదీ తిరుమల లడ్డూ కాంప్లెక్స్ మొదటి అంతస్తులోని 36 లడ్డూ కౌంటర్ క్యాష్ బాక్స్‌లోని రూ.2,47,250 అపహరణకు గురైంది. దీంతో లడ్డూ కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఆదినారాయణ తిరుమల ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు సీతాపతితో పాటు తిరుపతి పీకే లేఔట్‌కు చెందిన పి.చందుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసులో మొదటి నిందితుడుగా ఉన్న సీతాపతి గురువారం న్యాయమూర్తి ఎదుట నేరం అంగీకరించడంతో అతనికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. చందుపై కేసు విచారణ జరగాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రాలు ఇవే!



పద్మావతీపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ లోకేశ్వరి

- చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో 34,249 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- ఓటు వేయనున్న నలుగురు ట్రాన్స్‌జెండర్లు
- 26 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

తిరుపతి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల పరిశీలన పూర్తయింది. అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పర్యవేక్షణలో చేపడుతున్నారు. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లోని ఆరు మండలాలు, కార్పొరేషన్‌లకు సంబంధించి మొత్తం 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 34,249 గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదయ్యాయి. తుది ఓటరు జాబితాలను మండల కేంద్రాలకు చేరాయి. వీటితో పాటు ఓటరు స్లిప్పులు కూడా బీఎల్‌ఓలకు అందజేశారు. గ్రామాలు, నగరాల్లోని ఓటర్లకు రెండు రోజులుగా బీఎల్‌ఓలు స్వయంగా అందజేస్తున్నారు.

నలుగురు ట్రాన్స్‌జెండర్ల ఓటర్లు

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల పరిధిలో 34 వేలకు పైగా గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. అందులో నలుగురు మాత్రం ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో ముగ్గురు తిరుపతిలో ఉండగా, మరొకరు రామచంద్రాపురం మండలంలో ఓటు వేయనున్నారు. మొత్తం ఓటర్లలో 14,111 మంది అంటే కేవలం 41శాతం మాత్రమే మహిళా ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా తిరుపతి అర్బన్‌లో 8,494 మంది ఉంటే అత్యల్పంగా ఎర్రావారిపాలెం మండలంలో కేవలం 230 మంది మాత్రమే నమోదు చే సుకున్నారు.

26 పోలింగ్ కేంద్రాలు..

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల పరిధిలో మొత్తం 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా తిరుపతిలో 16, తిరుపతి రూరల్-4, చంద్రగిరి-2, పాకాల, రామచంద్రాపురం, ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు.

పోలింగ్ కేంద్రాలు..

ఎర్రావారిపాళెం: ఎర్రావారిపాళెంలోని జెడ్పీ హైస్కూల్

చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లులోని జెడ్పీ హైస్కూల్



మల్లంగుంటలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

పాకాల: ఎస్‌వీఎస్ ఇంగ్లిషు మీడియం స్కూల్

చంద్రగిరి: ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో రెండు బూత్‌లు

తిరుపతి రూరల్: తిరుచానూరు జెడ్పీ హైస్కూల్లో రెండు, పద్మావతిపురం హైస్కూల్లో రెండు బూత్‌లు ఏర్పాటు

రామచంద్రాపురం: జెడ్పీ హైస్కూల్

తిరుపతిలో: ఇక్కడ 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెద్దపీర్లచావిడిలోని వెంకటేశ్వర హైస్కూల్, ఎంఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాల, సరోజినీదేవిరోడ్డులోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్, కేటీ రోడ్డు ఎస్‌జీఎస్ హైస్కూల్, టీపీపీఎం కార్పొరేషన్ హైస్కూల్, పద్మావతి మహిళా వర్సిటీ హ్యుమానిటీస్ బ్లాక్, బైరాగిపట్టెడ ఎంజీఎం హైస్కూల్, కేటీ రోడ్డు ఎస్‌జీఎస్ హైస్కూల్, ఎస్టీవీ నగర్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, సంజయ్‌గాంధీకాలనీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్, చిన్నబజారువీధిలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, దొడ్డాపురం వీధిలోని మున్సిపల్ హైస్కూల్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, మాల్వాడీ వీధిలోని మున్సిపల్ హైస్కూల్, అక్కారంపల్లి హరిజనవాడలోని జెడ్పీ హైస్కూల్లో రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు.

క్రమసంఖ్య	మండలం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
1	తిరుపతి అర్బన్	11,775	8,494	3	20,272
2	తిరుపతి రూరల్	3,873	2,805	0	6,678
3	రామచంద్రాపురం	781	491	1	1,273
4	పాకాల	1,208	826	0	2,034
5	చంద్రగిరి	1,285	927	0	2,212
6	చిన్నగొట్టిగల్లు	723	338	0	1,061
7	ఎర్రావారిపాళెం	489	230	0	719
మొత్తం:		20,134	14,111	4	34,249

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించి కానుకగా ఇద్దాం



34, 35వ డివిజన్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని 19, 22, 34, 35 వార్డుల్లో గురువారం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులుగా ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. 2024ఎన్నికలకు ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది పలుకుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యంత మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా అందిద్దామని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, నీలం బాలాజీ, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, శ్రావణి, కల్వగుంట్ల నారాయణ, ఆరణి సంధ్య, సునీత, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ వేమూరి జ్యోతిప్రకాష్, పార్టీ నేతలు మార్కెట్ మునిరామిరెడ్డి, శ్రీదేవి, రాఘవులునాయుడు, దినేష్‌రాయల్, నాథముని, ప్రమీల, మాధురి, కంకనాల రమేష్, యోగానందరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పనులను మరింత వేగవంతం చేసి అనుకున్న విధంగా నిర్ణీత సమయానికి పూర్తిచేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశించారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం పనుల్లో భాగంగా చేపడుతున్న గర్భాలయ పనులను గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భాలయంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించి చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు. అలాగే అమ్మవారి గర్భాలయం పైభాగంతో పాటు ఆలయ ఆవరణలో చేపట్టే కట్టడాలకు వినియోగించే ఇటుకలను అమ్మవారి విశిష్టత తెలిపేలా ప్రత్యేకంగా తయారు చేసే విధానంపై ఎమ్మెల్యే ఆలయ అధికారులతో చర్చించారు. ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

30 ఏళ్ల కల సాకారం



భూమిపూజ చేస్తున్న అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ

- రూ.1.45కోట్లతో ఒరవ కాలువ నిర్మాణానికి భూమిపూజ

తిరుపతి మంగళం: మంగళం సప్తగిరినగర్ పంచాయతీలోని ప్రజల 30ఏళ్ల కల సాకారం అవుతోంది. 30ఏళ్లుగా పంచాయతీకి పెద్దకాలువ ఒరవకాలువ నిర్మాణం చేపట్టక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో స్పందించిన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒరవ కాలువ నిర్మాణానికి రూ.1.45కోట్లు నిధులను కేటాయించారు. దీంతో గురువారం సప్తగిరినగర్ పంచాయతీలో ఒరవకాలువ నిర్మాణానికి ఆ పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ భూమిపూజ చేశారు. పంచాయతీలోని ఒరవకాలువ నిర్మాణానికి రూ.1.45కోట్లు నిధులు కేటాయించిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికే దక్కుతుందని ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి తెలిపారు. 30ఏళ్లగా సమస్యను ఎదుర్కొంటున్న సప్తగిరినగర్ పంచాయతీ ప్రజల కళ్లల్లో ఆనందం నింపిన గొప్ప నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి అన్నారు. సప్తగిరినగర్ పంచాయతీ సర్పంచ్ నాగభూషణమ్మ, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ మహ్మద్‌ఖాసీమ్, ఎంపీటీసీ లక్ష్మయ్య, వార్డు మెంబర్లు మురుగ, మురళి, భాస్కర్, దీపశ్రీ, పార్టీ నేతలు మల్లెల నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

భాకరాపేట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి పట్టభద్రులను కోరారు. గురువారం చిన్నగొట్టిగల్లు మండలంలోని పట్టభద్రుల ఓటర్లను కలిసి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి గెలిపించాలను అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, ఖదీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఇద్దరు దళారులపై కేసు

తిరుమల: శ్రీవారి దర్శన టికెట్లు ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసగించిన ఇద్దరు దళారులపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీటీడీ విజిలెన్స్ వింగ్ ఏవీఎస్‌వో పద్మనాభన్ తెలిపిన వివరాలమేరకు.. విజయవాడకు చెందిన లక్ష్మణరావు నాలుగు నెలల క్రితం శ్రీవారి సుప్రభాతం దర్శన టికెట్లు ఇప్పించాలని శంకర్‌దయాళ్, సుబ్బారావు అనే దళారులను ఆశ్రయించారు. నాలుగు సుప్రభాతం దర్శన టికెట్ల కోసం రూ.28 వేలు భక్తుడు వారికి పంపారు. అయితే దళారులు భక్తుడికి ఎటువంటి దర్శన టికెట్లు ఇప్పించలేదు. దీంతో భక్తుడు మోసపోయామని గుర్తించి ఆయన టీటీడీ విజిలెన్స్ వింగ్‌కు ఇద్దరు దళారులపై ఫిర్యాదు చేశారు. ఆమేరకు టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులు తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్ సిఫారసు చేయడంతో పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారికి కానుకగా బ్యాటరీ వాహనం



బ్యాటరీ వాహనాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుమల: ఐడీబీఐ బ్యాంక్ చైర్మన్ రాకేష్ శర్మ గురువారం టీటీడీకి సుమారు రూ.7.67 లక్షల విలువైన బ్యాటరీ వాహనాన్ని కానుకగా అందజేశారు. ఐడీబీఐ బ్యాంక్ చైర్మన్ గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ఎదుట ఆరు సీట్లు కలిగిన బ్యాటరీతో నడిచే వాహనానికి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబుకు ఆ వాహనం తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ ప్రతినిధులు, తిరుమల డీఐ జానకిరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశంకరుల విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రత్యేక హోమాలను నిర్వహిస్తున్న పండితులు



ఆలయంలో ప్రతిష్ఠించిన స్వామి, నంది విగ్రహాలు

తిరుపతి రూరల్: ముత్యాలరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన గౌరిశంకర దేవాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం యంత్రస్థాపన, బింబస్థాపన, గౌరిశంకర, సాయినాథ, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యంస్వామి, ప్రత్యేక శనీశ్వరుడు, నాగశిలలు, నవగ్రహాలు, శిఖర ధ్వజస్తంభ పరివార బలిపీఠ ప్రతిష్ట కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. నాడీసంధానం, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, మహా కుంభాభిషేకం జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శ్రీరాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను గురువారం పార్టీ నాయకులు కాబోయే వధూవరులకు అందజేశారు. మండలంలోని ఏ.రంగంపేటకు పంచాయతీ రాగిమానుకుంట ఎస్టీ కాలనీకి చెందిన అల్లూరయ్య రెడ్డి, జ్యోతికి వివాహం నిశ్చమైంది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు బోస్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ ఎర్రయ్య ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాచికం, ముహూర్తపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు-కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, బొమ్మల రాజేష్, దిలీప్, సతీష్ తదితరులుపాల్గొన్నారు.



వివాహ కానుకను అందజేస్తున్న బోస్ చంద్రారెడ్డి

ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు కడప, విశాఖ



గోల్ చేసేందుకు ప్రయత్నిస్తున్న కడప స్ట్రయికర్స్

విశాఖ స్పోర్ట్స్: ఏపీ సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ, కడప జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. రైల్వే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో సెమీస్ చేరేందుకు వైఎస్సార్ కడప జట్టు 6-0 గోల్స్ తేడాతో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. జట్టు తరపున అనురాధ మూడు గోల్స్ చేయగా అరుణ రెండు, రామలక్ష్మి ఓ గోల్ చేశారు. సెమీస్ చేరేందుకు చెరో మ్యాచ్ గెలిచిన విశాఖ-చిత్తూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి విశాఖ జట్టు 4-3తో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. హేమహాసిని మూడు, వరలక్ష్మి ఓ గోల్ చేయగా చిత్తూరు తరఫున షహీనా మూడు గోల్స్ చేసింది. కల్యాణి, శృతి, ధరణి ఒక్కో గోల్ చేయడంతో కృష్ణా జట్టు 3-0తో శ్రీకాకుళంపై విజయం సాధించింది. తూర్పుగోదావరి జట్టు 2-0తో విజయనగరం జట్టుపై విజయం సాధించింది. అశ్విని, గాయత్రి చెరో గోల్ చేశారు. ఏపీ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల జట్లు తలపడుతున్నాయి.

తిరుచ్చిపై సూర్యభగవానుడు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న సూర్యనారాయణ స్వామివారు గురువారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త నక్షత్రం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేకసేవ అనంతరం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ జయకుమార్, అధికారులు ధనుంజయులు, అశోక్, సాయిస్వామి పాల్గొన్నారు.



తిరుచ్చిపై భక్తులను కటాక్షిస్తున్న సూర్యనారాయణ స్వామివారు

ఐదుగురికి ఐదేళ్ల జైలు శిక్ష

తిరుపతి లీగల్: ఓ వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఐదుగురికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వై.శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. అలాగే కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొన్న నలుగురు మహిళలు కావడంతో మానవతాదృక్పథంతో వారిని ఒక ఏడాదిపాటు ప్రొబేషన్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉండాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తిరుపతి ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో షాపు నం.95ను బి.సత్యనారాయణ అలియాస్ సతీష్ నిర్వహిస్తున్నాడు. 2017 అక్టోబర్ 25వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో మున్సిపల్ కమిషనర్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. ఆ సమయంలో సత్యనారాయణ కొంతమంది మురుగుకాలువను ఆక్రమించడం వల్ల డ్రైనేజీ బ్లాక్ అవుతోందని వారు డ్రైనేజీని ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మిగతా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్కెట్‌లో షాపునెం.100 నిర్వహిస్తున్న ఎం.చెంగారెడ్డి అనే వ్యక్తి అతనిపై ఫిర్యాదు చేశాడని అపోహ చెంది సత్యనారాయణతో తగువు పెట్టుకున్నాడు. దీంతో మార్కెట్‌లోని వ్యాపారస్తులు కొంతమంది వారికి సర్దిచెప్పి పంపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో సత్యనారాయణ తాను కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని అనడంతో మార్కెట్‌లోని వ్యాపారం నిర్వహిస్తున్న ఎం.చెంగారెడ్డి, తిరుపతి ఆటోనగర్ కృష్ణారెడ్డినగర్‌కు చెందిన వై.నరసింహారెడ్డి, వై.వెంకటేశ్‌రెడ్డి, వై.సురేష్, కొర్లగుంటకు చెందిన వి.హరి అలియాస్ హరిబాబు, ఎస్.శ్రీనివాసులు అలియాస్ మాస్, ఎం.రాజేశ్వరి, కొర్లగుంట పీసీఆర్‌నగర్‌కు చెందిన పి.నిర్మల, ఎ.రాజమ్మ, ఆటోనగర్‌కు చెందిన వై.గీత సత్యనారాయణపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో సత్యనారాయణ రుయాకు వెళ్లి తర్వాత ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి పదిమందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో మూడవ నిందితుడుగా వున్న వై.వెంకటేశ్‌రెడ్డి మృతిచెందాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఎం.చెంగారెడ్డి, వై.నరసింహారెడ్డి, వై.సురేష్, వి.హరి, ఎస్.శ్రీనివాసులకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ములో రూ.20వేలను ఫిర్యాది బి.సత్యనారాయణ అలియాస్ సతీష్‌కు ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. అలాగే కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొన్న ఎం.రాజేశ్వరి, పి.నిర్మల, వై.గీత, ఏ.రాజమ్మలను ప్రొబేషన్ ఆఫీసర్ పి.బాలప్రభాకర్‌రావు పర్యవేక్షణలో ఏడాదిపాటు ఉండాలని ఈ ఏడాది కాలంలో వారు ఎటువంటి నేరానికి పాల్పడకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని న్యాయమూర్తి తీర్పులో ఆదేశించారు. ప్రతి ఆరునెలల కోసారి జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ వారి ప్రవర్తనపై నివేదిక ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. నలుగురికి ఇద్దరు జామీను దారులు, రూ.25వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యూట్యూబ్ మోసగాడు అరెస్ట్

- జీతం డబ్బులు అడిగినందుకు మాజీ ఎండీపై హత్యాయత్నం
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుచానూరు(చంద్రగిరి): యూ ట్యూబ్ చానల్ పేరుతో పలు మోసాలకు పాల్పడడమే కాకుండా ఓ వ్యక్తిని హత్యచేసేందుకు యత్నించిన వ్యక్తిని తిరుచానూరు పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం విద్యానగర్‌కు చెందిన ప్రణీత్ అనే యువకుడు, తిరుపతి కొర్లగుంటకు చెందిన సయ్యద్ మీర్ అనే వ్యక్తి వద్ద ఓ యూ ట్యూబ్ చానల్‌కు ఎండీగా నెలకు రూ.3.5 లక్షల జీతంతో విధుల్లో చేరాడు. కొన్నాళ్లకు మీర్ అనే వ్యక్తి కొంతమంది పెద్దల పేర్లు చెప్పి పలు మోసాలకు పాల్పడుతుండడంతో తనకు చెడ్డ పేరు వస్తుందని గ్రహించి ప్రణీత్ ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఈ క్రమంలో మీర్ తనకు బకాయి పడ్డ రూ.4.5 లక్షల వేతనాన్ని ఇవ్వాలని పలుమార్లు కోరినా ఇవ్వకపోవడంతో, అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ ఫౌండర్ ముజిహుద్దీన్, జాతీయ అధ్యక్షుడు షోయాబ్‌లకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐహెచ్‌ఆర్‌సీ సభ్యులు అనంతపురంలోని కార్యాలయంలో పంచాయతీ చేసి రూ.3.7 లక్షలు ఇచ్చేట్టుగా తీర్మానం చేశారు. దీంతో మీర్ పలు దఫాలుగా రూ.1.5 లక్షలను చెల్లించాడు. మిగిలిన నగదును ఇవ్వాలని ప్రణీత్ పలుమార్లు కోరినా ఇవ్వకుండా తరచూ ఇబ్బందులు పెడుతూ వచ్చేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన మీర్‌ను నగదు కోరడంతో తనతో వస్తే ఇస్తానని చెప్పి, పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్ సమీపంలో ప్రణీత్‌పై మీర్ కత్తితో దాడికి యత్నించడంతో పాటు కులం పేరుతో దూషణలకు దిగాడు. ప్రణీత్ గట్టిగా కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి మీర్ అక్కడ నుంచి పారిపోయాడు. అనంతరం తన కుటుంబ సభ్యులు, బంధువుల సాయంతో గత సోమవారం తిరుచానూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో సయ్యద్‌మీర్‌ను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తిరుచానూరు పోలీసులు గురువారం తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,921 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,141 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అట్రాసిటీ కేసులో ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్: ఓ వ్యక్తిపై మారణాయుధంతో దాడిచేయడమే కాకుండా అతనిని కులంపేరుతో దూషించిన కేసులో తిరుపతి కొర్లగుంటకు చెందిన సయ్యద్‌మీర్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 5వ తేదీ తిరుపతి రూరల్ పద్మావతీపురం జెడ్పీ హైస్కూల్ వద్ద నిందితుడు మీర్ తిరుపతి రూరల్ పేరూరు విద్యానగర్‌కు చెందిన వై.ప్రజీత్‌పై మారణాయుధంతో దాడిచేసి కులంపేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు దర్యాప్తు చేసి సయ్యద్‌మీర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఎన్నికల కేంద్రం పరిశీలన

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని మండల తహసీల్దార్ హనుమాన్‌నాయక్ గురువారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్లకు పంపిణీ చేసిన స్లిప్పులపై సిబ్బందితో చర్చించారు.











